ప్రశాంతంగా ఉంది.

అలా ఏవో అనుకుంటున్నాను. నాలో నేనే.

అంతలో. వీస్తున్న గాలి పరిమళంలో ఏదో తేడా వచ్చినట్టుంది. పరిమళం స్థానే ఏదో వాసన వస్తోంది. ఈ క్రొత్త జన్మకి ముందు బాగా తెలిసిన పొగవాసన. అదే. సిగరెట్టు పొగవాసన నా ముక్కుపుటాలకు చేరింది.

ప్రక్కకు తిరిగి చూశాను. సిమెంటుబెంచీకి ఆ చివర ఒకతను సిగరెట్టు కాలుస్తున్నాడు. అందులో ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాడు.

పది సెకన్లవుతుందేమో. నాలో ఏదో అలజడి మొదలయ్యింది. నా రక్తం ప్రశాంతంగా ప్రవహిస్తూ ఒక్కసారి ఆగివేగాన్ని పెంచుకున్నట్లన్పించింది.

నా ఆలోచనలన్నీ ఆగిపోయాయి. అవెటో వెళ్ళి పోతున్నాయి. నా చేయి జేబు వైపుకి. నా దృష్టి పాన్‌షాపు వైపుకి.

పార్క్‌బయట ఉన్న పాన్‌షాపు కన్పిస్తోంది. నా కాళ్ళు అటువైపుకి వెళ్ళడానికి సిద్ధం అయ్యాయి. నా ప్రమేయం లేకుండానే లేచి నడుస్తున్నాను.

అంతలో...

"నేనే క్షణమూ విశ్రాంతి నెరుగలేదు.నీకు ఎటువంటి అసౌకర్యాన్నీ కలిగించలేదు. కాగా ఎంతో ఇబ్బంది పెట్టేవు. కంగారు పెట్టేవు. పొగతో ఊపిరాడనివ్వలేదు. శాయశక్తులా ప్రయత్నించేను నీ సుఖం కోసం. కానీ నువ్వు పట్టించు కోలేదు. చివరకు చెప్పక తప్పలేదు సహకరించలేదని. ఆఖరు నిముషంలో పట్టించుకున్నావు. అందుకు కారణం నీ వాళ్ళు. నీ శ్రేయోభిలాషులు. ఎలాగైతేనేం నా ఊపిరి నిలిచింది. కలకాలం కదలాడే అవకాశం చిక్కింది. నన్నిలా ఉండనీ. ఇలాగే కదలాడనీ. నన్ను బ్రతికించు. నువ్వు బ్రతుకు."

కలవరపడిందేమో... గుండె గొంతుక విప్పింది. నా మనసుకి చెప్పింది. నా మెదడుకి కబురంపింది.

పార్కు గుమ్మం దాటేవాడినల్లా ఆగిపోయాను. వెనక్కి తిరిగి చూశాను.ఆ సిమెంటు బెంచీ మీద అతనింకా సిగరెట్టు కాలుస్తూనే ఉన్నాడు. పార్కునంతా పరికించి చూశాను. పార్కులో చాలామంది ఉన్నారు.

అందులో... కొందరు సిగరెట్టు పొగపీలుస్తున్నారు. కొందరు సిగరెట్టో, బీడియో, చుట్టో అంటించుకున్నారు. నా వయసు వాళ్ళు. నాకంటే పెద్దవాళ్ళు. ముసలాళ్ళు యువకులు - కాలుస్తూనే ఉన్నారు. పొగపీలుస్తూనే ఉన్నారు. బయటకు వదుల్తూనే ఉన్నారు.

నాలాంటి వాళ్ళు ఇప్పుడున్న పరిస్థితుల్లో సిగరెట్లు కాల్చారు. కాల్చలేరు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి మళ్ళీ కాల్చడం మొదలుపెట్టినా - ఎట్టి పరిస్థితుల్లోనూ ఇంట్లో కాల్చలేరు.కారణం ఇంట్లో వాళ్ళు వాళ్ళచూపులు. వాళ్ళు కాల్చనివ్వరు.

కానీ... బయట మానసిక బలం వీగిపోయే పరిస్థితులు ఎదురైతే. ఆ పరిస్థితుల్తో కలిసి అడుగువేస్తే, కాళ్ళు సిగరెట్లు అమ్మేషాపు వైపుకి నడిస్తే, చేయి జేబులోకి వెళ్తే. మళ్ళీ సిగరెట్టు నోటికి చేరితే, నోరు, ముక్కు, గొంతుక, గుండె, ఊపిరితిత్తులు పొగమయమైతే... నికోటిన్ కలిసిన రక్తాన్ని చూసి గుండె నిట్టూరిస్తే...?

నాలాంటివాళ్ళ భవిష్యత్తేమిటి??

సినిమా హాళ్ళల్లోనూ, బస్సుల్లోనే కాదు. అన్నిచోట్లా కార్యాలయాల్లో. పబ్లిక్ ప్రదేశాల్లో. బహిరంగస్థలాల్లో, అన్నిచోట్లా... సిగరెట్టు వెలగడాన్ని ఆపాలి! సిగరెట్టు జీవితాల్ని కాల్చడం ఆగేది అప్పుడే!!!

కోరుకొండ సత్యానంద్
86-7-7, తిలక్ రోడ్,
రాజమండ్రి - 533 103.

కథ

# పేరులోనూ ఉంటుంది!

-ఆకెళ్ళ గిరిజ



అప్పారావు భార్య అచ్చాయమ్మ. ఇద్దరిదీ అన్యోన్య దాంపత్యం. అయితే వచ్చిన చిక్కల్లా అచ్చాయమ్మకి పని మనుషులు కుదరడం లేదు.

దాంతో అంట్లు తోము కోవడం, ఇంటిపనీ, వంటపనీ అన్నీ చేసుకుంటూ అప్పారావు ఆఫీసు వేళకి భోజనం వండి వడ్డించటం, అచ్చాయమ్మవల్ల కావడం లేదు.

దాంతో అప్పారావుకి ఆఫీసులో రోజూ లేటు మార్కు పడుతోంది. ఎన్నాళ్ళని లేటు మార్కులతో సతమత మవుతాడు అప్పారావు. అందుకని ఈ పనిమనిషి సమస్యకో పరి ష్కారం కనుక్కోవాలనీ - అది భార్యవల్ల కాదనీ గ్రహించి తానే స్వయంగా రంగంలోకి దిగాడు.

ఫ్రెండ్స్ ఇళ్ళల్లో పనిచేసే వాళ్ళనీ, ఆ వీధిలో పని చేసే పనిమనుషుల్నీ అయిదారు మందిని తనే స్వయంగా ఇంటర్వ్యూచేసి వీళ్ళ సిఫార్సు ద్వారా ఓ కొత్త పని మనిషిని తేలిగ్గానే ఏర్పర్చుకున్నాడు.

నెలకి వంద రూపాయలు ఇచ్చేటట్లూ, అంట్లు తోమడం, ఇల్లు ఊడ్చ డం, బట్టలు ఉతకడం చేయాలనీ - అన్నీ తనే పుర మాయించేశాడు.

భార్య అచ్చాయమ్మ ఎంతో సంతోషించింది అన్ని విధాలా తనకు తగ్గ పనిమనిషి దొరికినందుకు. కొత్త పని మనిషి డ్యూటీలో జాయిన్ అయింది.

"పనికూడా శుభ్రంగా చేస్తోందండి! పొద్దున్నే ఆరు గంటలకల్లా వచ్చి తనే నిద్రలేపుతోంది. ఇప్పుడు నిజంగా వంటచేసి నట్టు కూడా లేదు." అంటూ ఎంతో రిలీఫ్ మొహంలో కనబడుతుండగా చెప్పింది అచ్చాయమ్మ.

అప్పారావు ఆనందానికి అవధుల్లేవు. అయితే అప్పారావు ఆనందం ఎంతోకాలం నిలవ లేదు.

ఓ రోజు ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి అచ్చాయమ్మ పెద్ద గొడవచేసేసింది.

"ఏమైనా సరే - ఈ పనిమినిషి నా కొద్దు. మానిపించే యండి!" అంటూ.

"ఇంతకీ విషయం ఏమిటీ?" చిరాగ్గా అడిగాడు అప్పారావు.

"దాన్ని ఏం ఇంటర్వ్యూ చేశారు మీరు? దాని పేరు సినీస్టార్‌లా సరోజట. సరోజ...నా పేరేమో అచ్చాయమ్మానా! వీధిలో వాళ్ళందరి దగ్గరా నాకు తల వంపులుగా ఉంది. దాన్ని నేనెంత మాత్రం ఇక సహించను రోషంగా ముక్కుపుటా ఎగరేసింది అచ్చాయమ్మ. అంతే!! అప్పారావు కళ్ళు తేలేశాడు.

★

ఆకెళ్ళ గిరిజ
21-138-2, ఫ్లాట్ నం.41
ఉత్తమ్‌నగర్, I క్రాస్,
హైదరాబాద్-47.